
మంచిర్యాలలో పోటెత్తిన భక్తులు

కొలువుదీరిన తల్లులు

సమ్మక్కను ప్రతిష్ఠించిన పూజారులు
జాతరకు పోటెత్తిన భక్తులు
భక్తజన సంద్రంగా మారిన గోదావరి తీరం


మంచిర్యాలలో అమ్మవార్లను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


మందమర్రిలో మొక్కులు చెల్లించుకుంటున్న జీఎం


నస్పూర్‌లో డీసీసీ అధ్యక్షురాలు పూజలు

ఏసీసీ/మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు రెండో రోజు గురువారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే జిల్లా నలుమూలలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం గోదావరి సమీపంలోని ఇల్లారి వద్ద కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్కను మేళ తాళాలు, ఆటాపాటలతో గద్దె వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. దారి పొడవునా శివసత్తుల నృత్యాలు చేశారు. భారీగా తరలి వచ్చిన భక్తులను అదుపు చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. సమ్మక్కను తీసుకు వచ్చేటప్పుడు ఊరేగింపు పొడవునా స్పెషల్ పార్టీ పోలీసులు తాడుతో భక్తులను అదుపు చేస్తూ ఊరేగింపుగా ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. అనంతరం పూజారులు సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించారు. సారలమ్మ, సమ్మక్కలు కొలువు దీరడంతో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు క్యూ కట్టారు. అమ్మవార్లకు బెల్లం సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టారు. కొందరు తలనీలాలు సమర్పించుకున్నారు. మేకలు, కోళ్లను బలిచ్చి వంటలు చేసుకుని ఆరగించారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రవీందర్, రూరల్ సీఐ అశోక్, మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ నరేష్‌ల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం వద్ద సీసీ కెమెరాలను మానిటరింగ్ చేస్తూ ఆకతాయిలపై కన్నేసి దుందుడుకు చర్యలకు పాల్పడే వారిని అదుపు చేస్తున్నారు. జాతరలో తప్పిపోయిన పిల్లలను వెతికి తల్లిదండ్రులకు అప్పగించేందుకు పోలీస్ కంట్రోల్ రూం వద్ద నుంచి పర్యవేక్షించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారి శుధ్య కార్యక్రమాలు, తాగునీరు సరఫరా చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు భక్తులకు సేవలందిస్తున్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం, మంచినీటి పంపిణీ చేపట్టారు. అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో ఫైరింజన్ అందుబాటులో ఉంచారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల గోదావరి తీరంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పరిశీలించారు. ముందుగా వన దేవత లను దర్శించుకున్నారు. జాతర లో నిర్వహిస్తున్న పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర పనులను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈవో ముక్త రవి, చంద్రశేఖర్, శ్రీనివాస్, కుమార్, కిశోర్, ఆకుల శంకర్ పాల్గొన్నారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు చేపట్టారు. సీసీ కెమెరాలు, బైనాక్యులర్స్‌తో నిఘా పెట్టారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలోని సీసీసీ ముక్కిడి పోచమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మక్క-సారక్కల జాతర సందర్భంగా గురువారం వన దేవతలను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేం సాగర్ రావు దర్శించుకున్నారు. ప్రజలందర్నీ సుఖసంతోషాలతో ఉండే విధంగా దీవించాలని వేడుకున్నారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, పట్టణ అధ్యక్షుడు సుధాకర్ మహిళా నాయకురాలు యశోద, కౌన్సిలర్లు సంధ్యారాణి, మల్లయ్య ఉన్నారు.

రామకృష్ణాపూర్/ మందమర్రి టౌన్: సమ్మక్క సారక్క జాతరలో భాగంగా గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకుంది. పట్టణంలోని అంగడి బజార్‌కు చెందిన దూలం కనకయ్య గౌడ్ నివాసం నుంచి సమ్మక్కను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పాలవాగు ఒడ్డున గల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల పూనకాలతో అమ్మవారిని తీసుకు వచ్చారు. జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు, జీఎం మనోహర్ దంపతులతోపాటు గుర్తింపు సంఘం నాయకులు వాసిరెడ్డి సీతా రామయ్య, ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెపై ప్రతిష్ఠించిన వెంటనే భక్తులు అమ్మ వారి దర్శనం కోసం ఎగబడ్డారు. సమ్మక్క సారలమ్మ గద్దెలపై ఉండడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

పోచమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకొని మేకలు, కోళ్లను బలి ఇచ్చారు. మొక్కులో భాగంగా తలనీలాలు సమర్పిం చుకున్నారు. పలు వురు మహిళలు పిల్లాపాపలతో తులాభారం చేసుకొని బెల్లం బంగారాన్ని అమ్మవార్ల గద్దె వద్ద సమర్పించుకున్నారు. మార్కెట్ నుంచి కేకే 5 బంగ్లాస్ రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్ద బంగారంతో తులాభారం చేసుకుంటున్న దృశ్యాలే కనిపించాయి. చిన్నారులకు ఆట వస్తువులు కొనేందుకు గిరాకీ పెరిగింది. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.


మందమర్రిలో

సమ్మక్క సారలమ్మ ఆశీస్సులు సింగరేణిపై ఉండాలి

పాలవాగు వద్ద సమ్మక్క గద్దెలను జీఎం, అధికారులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి పోచ మ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. సమ్మక్క సారలమ్మ ఆశీస్సులు సింగరేణి సంస్థపై ఉండాలన్నారు. జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. తాగు నీరుతోపాటు విద్యుత్‌దీపాలు, స్నానఘాట్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతం అయినందున పాములు, తేళ్ల కనిపించినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎస్‌ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

మందమర్రి టౌన్: మేడారం సమ్మక్క సారక్క జాతరకు మందమర్రి నుంచి పెద్ద సంఖ్యలో ప్రత్యేక బస్సులు తరలి వెళ్లాయి. మందమర్రి నుంచి 80 బస్సులను ఏర్పాటు చేయగా దాదాపు 60కి పైగా బస్సులు భక్తులను తరలించాయి. శుక్రవారం కూడా భక్తులు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. గురువారం వరకు మందమర్రిలో ప్రత్యేక బస్సులకు రూ.7 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. తిరుగు ప్రయాణం ద్వారా మరో 30 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. మందమర్రి ప్రయాణ ప్రాంగణంలో గతంతో పోలిస్తే ఈసారి 50 బస్సులు పెంచారు. ఆర్టీసీకి కూడా పెద్ద సంఖ్యలో ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. బస్సులో వెళ్తే సమ్మక్క జాతరకు దగ్గర వరకు చేరుకునే అవకాశాలు ఉంటాయ న్నారు. దీంతో మేడారం వెళ్లేందుకు భక్తులు మొగ్గు చూపుతున్నారు.

మందమర్రిరూరల్: మేడారంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు ఆర్టీసీ బస్సులు,ప్రైవేటు వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. మండలంలోని ఆర్కే 1 గని వద్ద ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు ఎడ్లబండ్ల వాహనాల్లో వెళ్లి మొక్కులు తీర్చుకుంటున్నారు.

చెన్నూరు: మండలంలోని సుబ్బరాంపల్లి, కిష్టంపేట గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరుగుతుంది. బుధవారం రాత్రి సారలమ్మను, గురువారం సమ్మక్కను గద్దెపై ప్రతి ష్ఠించారు. దీంతో భక్తులు వన దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు పోసి, కోళ్ల, మేకలను బలి ఇచ్చారు. శుక్రవారంతో జాతర ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.

కాసిపేట: పెద్ద బుగ్గ సమీపంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోయ పూజారులు చిలుకల గట్టు నుంచి సమ్మక్కను గద్దెపై తీసుకు వచ్చి ప్రతిష్ఠించారు. దీంతో వన దేవతలను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వేమనపల్లి: మంగెనపల్లి గ్రామ శివారులో సమ్మక్క సారలమ్మజాతర ఘనంగా నిర్వహించారు. సారలమ్మ సమ్మక్కలను ప్రతిష్ఠించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోటపల్లి: మల్లంపేట, నక్కలపల్లి, రాపనపల్లి గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంప్రదాయాల ప్రకారం సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చారు. డప్పుచప్పుళ్ల మధ్య మంగళహారతులు, శివసత్తుల పూనకాలతో అటవీ ప్రాంతం నుంచి వెదురుబుట్టలో అమ్మవారిని తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. దీంతో భక్తులు ఎదుర్కోళ్లతో పాటు జంతుబలి ఇచ్చారు. వన దేవతలు గద్దెలపై ఉండడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీడీవో ఆకుల భూమన్న, కార్యదర్శి శ్రీవిద్యలు మొక్కులు చెల్లించుకున్నారు.

సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న జీఎం

శ్రీరాంపూర్ : సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన సమ్మక్క, సారలమ్మలను శ్రీరాంపూర్ జీఎం దంపతులు బి. సంజీవరెడ్డి, రాధాకుమారి దర్శించుకున్నారు. అమ్మవార్ల ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని మొక్కుకున్నారు. ముందుగా సమ్మక్కను గద్దెలపైకి తీసుకువచ్చే క్రతువులో వారు పాల్గొన్నారు. భక్తులకు ఏర్పాట్లు చేసిన వివిధ విభాగాల అధిపతులను అభినందించారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె. సమ్మయ్య,బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టెకిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఎస్‌ఓ టు జీఎం కె. రఘుకుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్ పద్మ, సేవా అధ్యక్షురాలు కొట్టె జ్యోతి పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో అమ్మవార్లను దర్శించుకుంటున్న జీఎం దంతులు




మంచిర్యాలలో గద్దెపై సమ్మక్కను ప్రతిష్ఠిస్తున్న కోయ పూజారులు, శివసత్తుల పూనకాలు, మందమర్రిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేలాల జాతరకు ఏర్పాట్లు చేయాలి


ఏసీపీని సన్మానిస్తున్న వేలాల జాతర కమిటీ సభ్యులు

జైపూర్, ఫిబ్రవరి 22: వేలాల మల్లన్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం గట్టు మల్లన్న, మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వచ్చే నెల 7వ తేదీ నుంచి జరిగే జాతర ఏర్పాట్లను తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్, నీటి వసతి, విద్యుత్, వైద్యం ఏర్పాట్లను తెలుసుకున్నారు. జాతరకు ఎంత మంది వస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేలాలకు వచ్చిన ఏసీపీని జాతర కమిటీ సభ్యులు సన్మానించారు. ఎస్ఐ ఉపేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, డేగ నగేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం


ధ్వంసమైన పూలే విగ్రహాలు

కోటపల్లి, ఫిబ్రవరి 22: బోరంపల్లిలో బుధవారం అర్ధరాత్రి మహాత్మాజ్యోతి రావు, సావిత్రి బాయి పూలే విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. గురువారం పంచాయతీ కార్యదర్శి మధుకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఉడుత బాపు రెండు విగ్రహాలను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాపును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బుజ్జిబాబు తెలిపారు. గ్రామంలో గొడవలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

మంచిర్యాల కలెక్టరేట్: కోటపల్లి మండలంలోని బోరంపల్లిలో మహాత్మా పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ బహుజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. వడ్డేపల్లి మనోహర్, డాక్టర్ నీలకంటేశ్వర్‌గౌడ్, రంగు రాజేశం, దుర్గం ఎల్లయ్య, రాజయ్య, అంజయ్య, రాజు, నూతన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 25న జరిగే తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపగాని రవీందర్, తోటపల్లి భూమన్న, జిల్లా అధ్యక్షుడు తోకల రాజేశంలు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో వేదిక గణనీయమైన పాత్ర పోషించిందన్నారు. మొదటి నుంచి తెలంగాణ భాష, ఆత్మ గౌరవం కోసం కంకణం కట్టుకుందన్నారు. మహాసభలకు కవులు,కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాగవర్మ, శ్రీమాన్, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

పాల్గొననున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మంచిర్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర శుక్రవారం జిల్లాలో జరుగనుంది. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని బీజేపీ విజయ సంకల్ప యాత్రలకు శ్రీకారం చుట్టింది. తాండూరు, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో రోడ్‌షోలు, బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు తాండూరు, 12 గంటలకు బెల్లంపల్లి, 2 గంటలకు మందమర్రి, సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలో సంకల్ప యాత్రలు జరుగనున్నాయి. జిల్లాలో జరిగే సంకల్ప యాత్రలకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరవుతున్నారు. జిల్లా కేంద్రంలోని ముఖరాం చౌరస్తా నుంచి రోడ్ షో, అనంతరం సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు 20వేల మంది హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా యాత్రలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు.


సభా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రఘునాథ్

బెల్లంపల్లి: బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లిలోని మార్కెట్ చౌరస్తాలో నిర్వహించే బహిరంగ సభలో కిషన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మూడోసారి ప్రధాని మోదీనే

మందమర్రి టౌన్: పార్ల మెంట్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా మూడోసారి మోదీనే ప్రధాని అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, రాష్ట్ర నాయకులు దుర్గం అశోక్‌లు తెలిపారు. మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో 370కి పైగా సీట్లు సాధిస్తా మని పేర్కొన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. శుక్రవారం మందమర్రిలో కిషన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నాయకులు డీవీ దీక్షిత్‌లు, కుమారస్వామి, దుర్గారాజు పాల్గొన్నారు.

గూడెంలో కొనసాగుతున్న పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దండేపల్లి, ఫిబ్రవరి 22: గూడెం సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా గురువారం స్వామి వారికి వైభవంగా స్థాళీపాక పంచసూక్త హోమ యజ్ఞం ప్రత్యేక పూజలను నిర్వహించారు. యగజ్ఞచార్యులు అభిరామచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి ప్రత్యేక పూజ కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నిరంతరం సప్తహం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

మట్టి నమూనాల సేకరణ


మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

జైపూర్, ఫిబ్రవరి 22 : గంగిపెల్లి గ్రామంలో జగిత్యాల జిల్లా పొలాసలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం భూసార పరీక్షల కోసం పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించారు. రైతులు ప్రతీ మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్షలు చేయిం చుకోవాలని, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి నికర ఆదాయం పెరగడమే కాకుండా భూసారాన్ని పరీక్షించుకోవచ్చని తెలిపారు. తిరుపతి, వివేక్, శ్రీవాత్సవ, రాంప్రసాద్, అక్షిత్‌లు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22: అర్చకులకు వేతనాలు విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ధూపదీప నైవేద్య అర్చక రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరు సతీష్‌శర్మ, అర్చక ఉద్యోగ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి ప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం పాత మంచిర్యాల రామాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వేతనాలు విడుదల చేయాలని విన్నవించగా ప్రభుత్వం స్పందించిందన్నారు. రాజేష్, శ్రావణ్, జలందర్, రామ్మోహన్ శర్మ, భీమేష్ శర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌లైన్ల ఏర్పాటుతో అగ్నిప్రమాదాల నివారణ


నీలగిరి ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి, ఫిబ్రవరి 22: అటవీ ప్రాంతంలో ఉన్న ప్లాంటేషన్‌లలో ఫైర్‌లైన్‌లను ఏర్పాటు చేయడం ద్వారా వేసవిలో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) హైద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం బ్రాహ్మణపల్లిలో టీఎస్‌ఎఫ్‌డీసీకి చెందిన నీలగిరి, టేకు ప్లాంటేషన్‌లలో చెట్ల ఎదుగుదలకు చేపట్టిన నిర్వహణ పనులను పరిశీలించారు. వేసవి కాలంలో ప్లాంటేషన్‌లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి, రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్, ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

గీత కార్మికుడికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 22: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిలివేరి రాజమల్లయ్య గురువారం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య వృతిరీత్య కల్లు గీస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ప్రమాదంలో రాజమల్లయ్య కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

హాజీపూర్, ఫిబ్రవరి 22: వేంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 20న గడ్డి మందు తాగిన జైపూర్ మండలంలోని కుందారం గ్రామానికి చెందిన విజ్జగిరి సమ్మయ్య (51) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సమ్మయ్య సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20న విధులకు వచ్చిన సమ్మయ్య వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన సిబ్బంది మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి కుమారుడు రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 22: పట్టణంలోని మల్లికార్జున నగర్‌కు చెందిన గుడిసె కొమురయ్య ఇల్లు బుధవారం షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయంతోపాటు సరుకులను అందజేశారు. పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, గోపతి రాజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ జంగం కళ, విద్యాసాగర్, అబ్దుల్ ఆజీజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తాండూర్, ఫిబ్రవరి 22: తంగళ్లపల్లి గ్రామానికి చెందిన పంబాల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా రమేష్‌తోపాటు పదో తరగతి చదువుకున్న 1994-95 బ్యాచ్ మిత్రులు గురువారం రమేష్ దశదిన కర్మకు హాజరయ్యారు. రమేష్ కుమారుడు విష్ణుతేజ, కూతురు వర్షినీలకు రూ.38 వేల ఆర్థిక సహాయం అందించారు. బక్కయ్య, అన్నం శ్రీనివాస్, సింగారపు రఘు, కేశెట్టి విజయ్,కటకం తిరుపతి, రాజేష్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడి నియామకం

నస్పూర్, ఫిబ్రవరి 22: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) మండల అధ్యక్షుడిగా కొంకట మహేందర్‌ను నియమించినట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, జిల్లా ఇన్‌చార్జి తుంగపిండి రాజేశ్ కుమార్ ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు.

శిక్షణతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు, ట్రైనీ కానిస్టేబుళ్లకు మెటీరియల్ అందజేస్తున్న సీపీ

హాజీపూర్, ఫిబ్రవరి 22: క్రమశిక్షణతో శిక్షణ పొంది వృత్తిపరమైన నైపుణ్యా లను పెంపొందించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం గుడిపేట 13వ బెటాలియన్ స్టైపండరీ క్యాడెట్ పోలీస్ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు సీపీ అతిథిగా హాజరై మాట్లా డారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పోలీస్ ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం ఉద్యోగం సాధించ దానికి అభ్యర్థులు అహోరాత్రులు కష్టపడి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. ఇందులో కొందరికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయని, ఇక్కడకు వచ్చిన వారు ఇందులో ఉండడం సంతోషకరమన్నారు. శిక్షణలో నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నించాలన్నారు. ఎంపికైన వారు శిక్షణ పూర్తిచేసుకుని పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీసు వృత్తి ఉన్నతమైనదని, నిరంతరం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాల న్నారు. సమర్థత, వృత్తి నైపుణ్యం, నీతి, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సీపీ తన స్వీయ అనుభవాలను పంచుకు న్నారు. గుడిపేట బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా మాట్లాడు తూ శిక్షణలో 331 మందికి ట్రైనింగ్ ఇస్తారని, గురువారం 221 మంది హాజర య్యారని, ఇంకా 90 మంది హాజరు కావాల్సి ఉందని, హాజరు కాని వారు మార్చి 1లోపు గుడిపేట బెటాలియన్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. అనంతరం కానిస్టేబుల్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను శిక్షకులకు అందజేశారు. ఏసీపీ రత్నపురం ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, మెడికల్ డాక్టర్ శ్రీధర్, డానియెల్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మైసమ్మ జాతర పోస్టర్ల విడుదల


జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్, ఆదివాసీ నాయకులు

కోటపల్లి, ఫిబ్రవరి 22: గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్లను గురువారం తహసీల్దార్ మహేందర్ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ నెల 23న గోదావరి పుణ్యస్నానాలు, 24న భీమన్న పూజ, మైసమ్మ గుట్టపైన పూజ, 25న జాతరతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, దర్బార్ జరుగుతుందని సంఘం నాయకులు తెలిపారు. నాయకులు మాంతయ్య, మహేందర్, లక్ష్మణ్, నర్సన్న పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22 : మంచిర్యాల గోదావరి తీరంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు అల్పాహారం పిపణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గీట్ల సుమిత్, సెక్రటరీ గోవర్ధన్,ఉపాధ్యక్షురాలు కవిత, కోశాదికారి శ్రీనివాస్,హఫీజ్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి

నెన్నెల, ఫిబ్రవరి 22: రైతులందరు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్ సూచించారు. గురువారం కుశ్నపల్లిలో రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్‌తోపాటు ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈకేవైసీ లేక పోవడంతో చాలా మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం


షీటీంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవయ్య

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22: మహిళల భద్రతే షీటీం లక్ష్యమని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి బస్తీలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ క్రైం, షీటీంలపై అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే షీటీం స్పందిస్తుందన్నారు. సోషల్ మీడియా ద్వారా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సైబర్ క్రైం మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మట్టి రవాణాను తరలింపును అడ్డుకున్న నాయకులు

జైపూర్, ఫిబ్రవరి 22: రామారావుపేట శివారులో అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న నిర్వాహకులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, సుంకరి శ్రీనివాస్‌లు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే మైనింగ్ అధికారులకు తెలియజేయడంతో మైనింగ్ ఆర్‌ఐ శ్రీనివాస్ లారీని సీజ్ చేశారు. పదుల సంఖ్యలో లారీలు, ఎక్స్‌కావేటర్ ఉన్నప్పటికీ లోడ్‌తో ఉన్న లారీని మాత్రమే పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. మైనింగ్ అధికారులు డబ్బులు తీసుకుని మట్టి రవాణాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని ఆకెనపల్లి శివారులో సర్వే నెంబరు 3లోని అసైన్డ్ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సోమగూడెం మాజీ సర్పంచు ప్రమీల గౌడ్, ఎంపీటీసీ చుంచు మల్లమ్మలు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూమిని కబ్జా చేసి అనుమతులు లేకుండా వెంచర్ వేసిన కారుకూరి రాంచందర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ అసైన్డ్ భూమిని డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికకు కేటాయించారని, ఈ భూమిపై విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకుని ప్రజల అవసరం నిమిత్తం వినియోగించాలని కోరారు. కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని ఆర్డీవోకు ఆదేశాలు ఇచ్చినట్లు ప్రమీలగౌడ్ తెలిపారు.

క్యాలెండర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22 : తెలంగాణ ట్రెజరీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌లను గురువారం నస్పూర్‌లోని జిల్లా సమీకృత భవన సముదాయంలో జిల్లా ఖజానాశాఖ అధికారి రాజేశ్వర్ విడుదల చేశారు. కార్యక్రమంలో అసోసియేన్ జిల్లా ముఖ్య కార్యదర్శి దూలం శ్రీధర్, నాయకులు తిరుమలేశం, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా భూమిలో జీపీ నిర్మాణాన్ని నిలిపివేయాలి

నెన్నెల, ఫిబ్రవరి 22: తన పట్టా భూమిలో గ్రామ పంచాయతీ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారని మెట్ప ల్లి గ్రామానికి చెందిన రైతు దుగుట రాజం తెలిపాడు. గురువారం నెన్నెలలో విలేకరులతో మాట్లాడాడు. గ్రామ శివారులోని సర్వే నంబరు 257లో తన పేరిట ఉన్న ఆరు గుంటల భూమిలో మాజీ సర్పంచ్ నీలానారాయణ దౌర్జన్యంగా నిర్మాణం చేపట్టారని చెప్పాడు. నిర్మాణాన్ని అడ్డుకుంటే ఎదురు దాడికి దిగుతున్నారని పేర్కొన్నాడు. నిర్మాణాన్ని నిలిపి వేసి తనకు న్యాయం చేయాలని రాజం ఉన్నతాధికారులను కోరుతున్నాడు.

రైతులపై కాల్పులను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మంచిర్యాల, రామకృష్ణాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, డీఎస్‌యూ నాయకులు గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. లాల్‌కుమార్ మాట్లాడుతూ హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో రైతులు నిరసన చేపట్టగా పోలీసులు కాల్పులు జరపడంతో శుభకరన్‌సింగ్ మృతి చెందాడని తెలిపారు. యువకుడి మృతికి కారణమైన పోలీసు అధికారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వ్యతిరేక విధానాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. నాయకులు శ్రీనివాస్, మంగ, శ్రీకాంత్, అరుణ, రాజన్న, చిన్నయ్య, కాంతయ్య, సురేందర్, బాపు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రైతులపై రబ్బర్ బుల్లెట్లతో పోలీసులు కాల్పులు చేయడాన్ని నిరసిస్తూరాజీవ్‌నగర్ చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై కాల్పులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని పాదయాత్ర చేస్తుంటే వారిపై బుల్లెట్లు కురిపించడంతో శుభకరణ్ అనే యువకుడు మరణించాడన్నారు. కాల్పులకు అనుమతి ఇచ్చిన పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చే స్తున్నామన్నారు. నాయకులు గజ్జి మల్లేష్, ముత్యాల వెంకటేష్, అప్పారావు, బంగారు నాగరాజు, సత్యం, శివ, సంపంగి నాగరాజు, మల్లయ్య, ఉమ, పాల్గొన్నారు.

సిబ్బంది దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యం: ఎస్పీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ముఖ్యమని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండడానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

జిల్లా పోలీసు కార్యాలయంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ముత్యం రాజు బదిలీపై సిద్దిపేట కమిషనరేట్‌కు వెళ్తుండడంతో గురువారం ఎస్పీ సురేష్‌కుమార్ ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగం ఎక్కడ చేసినా క్రమ శిక్షణ తో బాధత్యాయుతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐలు రాణాప్రతాప్, సతీష్, ఏవో శ్రీనివాస్, సీఐ మార్కండేయ పాల్గొన్నారు.

తేనె శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ డీఆర్డీవో

వాంకిడి, ఫిబ్రవరి 22: మండలకేంద్రంలోని తేనె శుద్ధి కేంద్రాన్ని గురువారం అడిషనల్ డీఆర్డీవో అరక చరందాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా తేనెశుద్ధి చేసే విధానాన్ని, తేనెవిక్రయాలు తదితరఅంశాల గురించి ఐకేపీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. మహిళలు పొదుపును అలవర్చుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగిరుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణ, అన్నాజీ, ఏపీఎం మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, ఫిబ్రవరి 22: కౌటాల సబ్ స్టేషన్ పరిధిలోని చీపురుదుబ్బ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, బోధన్‌పల్లి, కన్కి, యాపల్‌గూడ గ్రామాల్లో ఈనెల23,24తేదీల్లో ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

జ్వరంతో విద్యార్థిని మృతి


షేక్ అంజుమ్(ఫైల్)

వాంకిడి, ఫిబ్రవరి 22: మండల కేంద్రానికి చెందిన షేక్ అంజుమ్ (13) అనే 9వతరగతి విద్యార్థిని జ్వరంతో గురువారం మృతిచెందింది. విద్యార్థిని తల్లిదండ్రులు షేక్ ఫాతిమా, కరీం తెలిపినవివరాల ప్రకారం.. అంజుమ్ ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని మైనార్టీ గురుకులంలో 9వతరగతి చదువుతోంది. ఈనెల20న సాయంత్రం ఆమెకు జ్వరం రావడంతో ఇంటికి తీసుకువెళ్లాని పాఠశాలసిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఇంటికి తీసుకెళ్లారు. బుధవారం ఆసిఫాబాద్ ప్రైవేటుఆసుపత్రిలో చికిత్సచేయిం చారు. గురువారం తెల్లవారు జామున తీవ్రఅస్వస్థతకు గురైంది. దీంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యంవల్లనే తనబిడ్డ మృతిచెందిందని వారు ఆరోపించారు.

కొలువుదీరిన అమ్మవార్లు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 22: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో బుధవారం రాత్రి, గురువారం రాత్రి సారలమ్మ, సారక్క కొలువు తీరారు. వనం నుంచి కోయపూజారులు డప్పు వాయిద్యాల మధ్య అట్టహాసంగా అమ్మవార్లను తీసుకొచ్చారు. అనంతరం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగావివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్, సిబ్బంది ఏర్పాట్లుచేశారు. సీఐ నాగరాజు, ఎస్సై సోనియా, పోలీసులు బందోబస్తునిర్వహించారు.


వనం నుంచి సారలమ్మను తెస్తున్న పూజారులు


శివసత్తుల పూనకాలు


బెజ్జూరులో గద్దెల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బెజ్జూరు: వనతదేవతల దర్శనం కోసం చివరి రోజు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. మండలంలోని రేచిని తెల్లరాళ్లగుట్ట, సోమిని సమీపంలోని ప్రాణహిత నది ఎర్రబండ వద్ద ఏర్పాటు చేసిన సమ్మక్క- సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. తల్లుల దర్శనం కోసం వివిధ గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి నిలు వెత్తు బంగారాన్ని సమర్పించారు. దీంతో వనదేవతల ప్రాంగణం జనసంద్రమైంది. ఎస్సై విక్రం ఆధ్వర్యంలో జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన జడ్పీ సీఈవో


జైనూరులో పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అనిల్

జైనూర్, ఫిబ్రవరి 22: జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో జడ్పీసీఈవో అనిల్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తు సేవలందించాలన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కెరమెరి: వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా ప్రత్యేకాధికారులు పనిచేయాలన్నారు. అలాగే సీసీరోడ్లను నాణ్యతగా నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను జడ్పీటీసీ ధ్రుపతాబాయి, వైస్‌ఎంపీపీ కలాం సన్మానించారు. కార్యక్రమంలో సీఈవో లక్ష్మినారాయణ, ఎంపీడీవో కృష్ణారావు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళల స్థితిగతులపై అధ్యయనం

కెరమెరి, ఫిబ్రవరి 22: గోండ్వాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళల స్థితిగతులపై ప్రొఫెసర్ ఉష గురువారం మండలంలోని పలుగ్రామాల్లో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లెగాం, కోఠారి, అంబరావుగూడ గ్రామాలను సందర్శించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయం, పోడుభూముల సమస్య తదితరాలను పరిశీలించారు.

రూ.20లక్షల బీమా చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న టీజీబీ చైర్మన్ వై శోభ

దహెగాం, ఫిబ్రవరి 22: మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన గుర్నులె లావణ్యకు రూ.20లక్షల ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ చెక్కును టీజీబీ చైర్మన్ వైశోభ గురువారం అందజేశారు. లావణ్య భర్త శంకర్ వర్షాకాలంలో ట్రాక్టర్ కేజీవీల్ కొట్టెక్రమంలో ప్రమాదవశాత్తు మరణించడంతో బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవిత బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం మురళీ మనోహర్, ఎస్ఎంవో రఘువీర్‌శర్మ, శ్రీనివాసరావు, మేనేజర్ కుమార్‌రాజ, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కౌటాల, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం సామూహిక సత్యనారాయణ వ్రతాల్ని నిర్వహించారు. 120జంటలతో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామివ్రత కథను చదువుతూ విశిష్టతను తెలియపర్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యం సంఘం నాయకుల వెంకన్న, శ్రీనివాస్, బిప్రకాష్, ఇ.వెంకటేశ్వర్లు, ఆర్.సిద్దేశ్వర్, ఇ వెంకన్న దివాకర్, బి.సుధాకర్, ఇకైలాసం తదితరులు పాల్గొన్నారు.


సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్ రూరల్: బూర్గుడ గ్రామ పంచాయతీ పరిధిలోని కేస్లాపూర్‌లో జరిగే సమ్మక్క- సారలమ్మ జాతర సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లాఅధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు ప్రభుత్వం తరపున పూజారి ఎం రమేష్‌కు జాతరలో భక్తుల సౌకర్యం కోసం రూ.లక్ష చెక్కును గురువారం అందజేశారు.

జైనూర్: విద్యార్థులకు విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషిచేయాలని జైనూర్ స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం జాదవ్ మధుకర్ అన్నారు.

-వచ్చే ఇంటర్మీడియట్ వార్షికపరీక్షల్లో ఉన్నతశ్రేణి మార్కులతో కాలేజీకి గొప్ప పేరు తీసుకురావాలని జైనూర్ ఎస్‌ఐ సందీప్‌కుమార్ అన్నారు.

సిర్పూర్(యు): యుతవ స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టిసారించాలని కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్ జిల్లాచైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు.

జైనూర్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

జైనూర్, ఫిబ్రవరి 22: ఆసిఫాబాద్ మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం జైనూరులో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబుతాలిబ్, సీనియర్ నాయకులు మేస్రం అంబాజీరావ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిర్యాణి, ఫిబ్రవరి 22: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీజిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అనీల్‌గౌడ్, సాగర్, స్వప్న, బాలేష్‌గౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

బెడెన్‌పౌల్ ఆలోచన విధానంతో ముందుకు సాగాలి


బెడెన్‌పౌల్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న జీఎం, పీఎం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 22: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్‌పౌల్ ఆలోచన విధానంతో విద్యార్థులు ముందుకుసాగాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. పట్టణంలోని సింగరేణి పాఠశాలలో బెడెన్‌పౌల్ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సాహసమే ఊపిరిగా, సేవే పరమావధిగా అందరూ ఒకే నిర్ణయంతో ఉంటే ప్రపంచాన్ని కూడా మార్చవచ్చన్నారు. కార్యక్రమంలో కరస్పాంటెండ్, పీఎం శ్యాంసుందర్, మాస్టర్లు కుమార్, కల్పలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

రెబ్బెన: విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఏజీఎం ఎంతిరుమల్‌రావు అన్నారు. గురువారం ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. బైడెన్ పౌవెల్ జయంతి సందర్భంగా ప్రపంచంలోని 165దేశాల్లో ఈ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోలేటిటౌన్ షిప్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఇన్‌చార్జీ హెచ్‌ఎం బాబునాయక్, స్కౌట్ మాస్టర్ భాస్కర్, జిల్లా కెప్టెన్ సృజన, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ మేనేజర్ సర్వే రవిని సన్మానించిన జీఎం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22: సంస్థ అభివృద్ధి కోసం కార్పొరేట్ సర్వే జనరల్ మేనేజర్ పీఎస్‌కే రవి చేసినసేవలు ప్రశంసనీయమని మందమర్రి జీఎం మనోహర్ అన్నారు. గురువారం సాయంత్రం జీఎం కాన్ఫరెన్సు హాల్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల పదవీవిరమణ పొందుతున్న రవి తమలాంటి వారెందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఈఅండ్‌ఎం నాగరాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, ఎఫ్‌అండ్‌పి ఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

● విజయ సంకల్ప యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



కాగజ్‌నగర్‌లో కిషన్ రెడ్డికి ఘనస్వాగతం



జైనూరులో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 22: ఎస్పీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, వీలైతే జెకె యాజమాన్యాన్ని ఢిల్లీకి రప్పించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. గురువారం కాగజ్‌నగర్ ప్రజాకార్యాలయంలో ఎస్పీఎం కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న పీఎం మోదీ చేపట్టిన పలుబ్యాంకింగ్ విధానాలతోనే మూతబడిన ఎస్పీఎం తెరుచుకున్నట్టు తెలిపారు. ఎస్పీఎం కార్మికుల పట్ల యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు కేంద్ర కార్మిక మంత్రి దృష్టికి తీసుకపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎవరూ అధైర్యపడవద్దన్నారు. గతంలో కాశ్మీర్‌లో మతకల్లోలాలు, ఉగ్రదాడులు, అరాచకాలు జరిగేవన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కాశ్మీర్‌లో ప్రజలు స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంటున్నట్టు తెలిపారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై పోరాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్మికుల పక్షాన పోరాడతామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జేకే యాజమాన్యం ఒంటెద్దు పోకడలకు పోతోందన్నారు. ఈప్రాంతం వారికి తక్కువ జీతాలు, ఇతర ప్రాంతాల వారికి ఎక్కువ జీతాలివ్వడంపై మండిపడ్డారు. ఇదే విషయాన్ని కూడా అసెంబ్లీలో ప్రస్తావించినట్టు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించటంతో పాటు విడుదల జీవోలను కూడా అమలు చేసేట్టు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ట్రేడ్‌యూనియన్ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, కల్లోల భట్టాచార్య, కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం, వీరభద్రచారి పాల్గొన్నారు.

● ప్రాజెక్టుల పేరిట పచ్చి దగా.. మోసం - మాజీమంత్రి ఈటల రాజేందర్

జైనూర్: తెలంగాణ రైతులకు గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట పచ్చి దగా, మోసం చేసిందని మాజీమంత్రి ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. మండలకేంద్రంలో గురువారం బీజేపీ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని అన్నారు. ఆ నాడు జల్‌జంగల్, జమీన్‌కోసం అసువులుబాసిన అడవిబిడ్డ కుంరంభీం సాధించిన పెట్టిన పోడుభుములకు కనీసం పట్టాలు ఇవ్వలేదన్నారు. ధరణి, భూప్రక్షాళనపేరట రైతులను నిలువు దోపిడీ చేశారని ఆరోపించారు. ఉద్యోగులు, పింఛన్‌దారులకు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. దీంతో ఉద్యోగుల ఉసురు తగలడంతో కేసీఆర్ ప్రభుత్వం ఘోరపరాజయం పాలైందన్నారు. ఇక ఖజానా ఖాళీఉన్న కాంగ్రెస్‌ప్రభుత్వం 2లక్షల రూపాయల రుణమాఫీ ఎలాచేస్తుందని ప్రశ్నించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ కేంద్ర ప్రభుత్వం నిధులతో జిల్లాలో అనేకసంక్షేమకార్యక్రమాలు అమలుచేశారన్నారు. గిరిజనులు, గిరిజనేతర రైతులకు రైతు బంధు, పోడు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ముఖ్యంగా గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మరోకొద్ది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలు బీజేపీని ఆదరించాలన్నారు. బీజేపీతరఫున పోటీలో ఉన్న ఎంపీ అభ్యర్థిని భారీమెజార్టీతో గెలిపించాలన్నారు.

కుమరం భీం పోరాట స్ఫూర్తితో ఎన్నికలు సిద్ధం..

కెరమెరి: కుమరంభీం పోరాటస్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన విజయసంకల్ప యాత్ర కెరమెరికి చేరుకుంది. ఈసందర్భంగా మండలకేంద్రంలోని కుమరంభీంవిగ్రహానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని బలపర్చాలన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీ సోయంబాపూరావు, మాజీఎంపీ రమేష్ రాథోడ్, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే

ఆసిఫాబాద్ రూరల్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఈటల రాజేందర్ అన్నారు. విజయ సంకల్పయాత్రలో బాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. దేశం ఘనత చందమామ వరకు చేరిందన్నారు. ఎన్నో రకాల చిక్కుల్లో ఉన్న అయోధ్య అంశాన్ని ఎటువంటి గొడవలు లేకుండా పరిష్కరించామన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 370కి పైగా సీట్లు సాధించడమే లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, రాథోడ్ రమేష్, కోట్నాక విజయ్, సతీష్‌బాబు, చర్ల మురళి పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్



లైబ్రరీలో కలెక్టర్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షికపరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సమర్థవం తంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణు, సురేష్‌కుమార్‌తో కలిసి జిల్లావిద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులతో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల28నుంచి మార్చి19వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో19 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మార్చి 18నుంచి ఏప్రిల్ 2వరకు పదవ తరగతిపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు37కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షకేంద్రానికి సూపరింటెండెంట్, శాఖాధికారులను నియమించామన్నారు. విద్యార్థులు ప్రశాంతవాతావరణంలో ఎలాంటి ఒత్తిడికి లేకుండా పరీక్షలురాసే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యార్థులు సమయానికి కంటే ముందేకేంద్రాలకు హాజరయ్యేలాచర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల్లో ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు ఏర్పాట్లతోపాటు వైద్యసిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షాకేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలుచేయాలన్నారు. పరీక్షల సమయంలో జిరాక్స్‌సెంటర్లు మూసిఉంచాలన్నారు. సమావేశంలో డీఈవో అశోక్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్, డీఎస్పీ కరుణాకర్‌పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..

ఆసిఫాబాద్ రూరల్: గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వెనకబడవచ్చు కానీ చదువులో ముందుండే జిల్లాగా నిలిచిపోతుందన్నారు. విద్యార్థులు, వివిధ ఉద్యోగాలు సాధించు కునేలా కృషిచేసిన జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో పాటు కాంపిటేటివ్‌బుక్స్‌ను అందజేసిన నక్క యాదవ్ సోదరులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, శరత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరకు వేళాయే

● నేటి నుంచి మూడురోజుల పాటు జాతర
● భారీగా తరలిరానున్న భక్తులు
● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



గంగాపూర్ ఆలయం



కొలువు తీరిన స్వామివారు

రెబ్బెన, ఫిబ్రవరి 22: రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులకు కొంగుబంగారం. ప్రతిసంవత్సరం మాఘశుద్ధపౌర్ణమి నాడు తిరుమల తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరస్వామి మూడు గడియలపాటు గంగాపూర్ ఆలయంలో కొలువుదీరి భక్తులకోరికలు తీరుస్తారని ప్రగాఢవిశ్వాసం. దీంతో మాఘశుద్ధ పౌర్ణమినాడు భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటారు. ఈసందర్భంగా మూడు రోజులపాటు జరిగేజాతరకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ఈ నెల23,24,25 తేదీల్లో జరుగుతుంది. శుక్రవారం స్వామివారి కల్యాణం, శనివారం రథోత్సవం, ఆదివారంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు చుట్టు పక్కల జిల్లాల ప్రజలు మాత్రమే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్‌దీపాలు, తాత్కాలిక మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, క్యూలైన్ల ఏర్పాటు చేశారు. మండల కేంద్రం నుంచి ఆలయం వరకు రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను, ముళ్లపొదలను తొలగించి వెడల్పు చేశారు. జాతరఏర్పాట్లను స్వయంగా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీసురేష్ పర్యవేక్షిస్తూ సిబ్బందికి, అధికారులకు సలహాలు, సూచనలుచేస్తున్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి..-బాపిరెడ్డి, ఈవో



శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరునున్న గంగాపూర్ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశాం. రెబ్బెన నుంచి గంగాపూర్ ఆలయం వరకు రోడ్డు వెడల్పుతో పాటు భక్తుల సౌకర్యార్థం మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం.

ఉత్తమ ఫలితాలపై దృష్టి సారించాలి

● ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

వాంకిడి, ఫిబ్రవరి 22: ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండలంలోని వాంకిడి, బంబార గిరిజనబాలురబాలికల ఆశ్రమపాఠశాలలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధనలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతులు కల్పిస్తూ మెరుగైనవిద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేకతరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం వాంకిడి ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి ప్రతిరోజు వైద్యశాలకు వస్తున్న రోగుల వివరాలను, అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు.

దుండగులను శిక్షించాలని రాస్తారోకో



వాంకిడిలో రాస్తారోకో చేస్తున్న మాలి సంఘం నాయకులు

వాంకిడి/కౌటాల, ఫిబ్రవరి 22: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని బోరపల్లి గ్రామంలో బుధవారం రాత్రి మహాత్మా జ్యోతి బాపూలే, సావిత్రి బాయిపూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని వాంకిడి, కౌటాల మండల కేంద్రంలోని మాలిసంఘం నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయ కులు బాబురావు, వాసు, మెంగాజీ, సుధాకర్, అశోక్, పోచయ్య, కౌటాలలో వసంత్ రావు, నాందేవ్, సెండె నాందేవ్, ముత్తశ్వర్, చందు పాల్గొన్నారు.



జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



అంధ్రజ్యోతి వన-జన జాతర February21-24 2024

- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్ల, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.



సమ్మక్క గద్దె





క్యూలైన్లలో భక్తుల రద్దీ







ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.